www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 29 అక్టోబర్ 2024
5
అన్నమయ్య



మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవి కుమార్ డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంపాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్మికులతో కలిసి పురపాలక కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాల విస్తరణ మేరకు కార్మికుల సంఖ్య పెంచాలని, వారికి పనిముట్లు, రక్షణ పరికరాలు అందజేసి భద్రతా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. తుప్పు పట్టిన వాహనాలకు మరమ్మతులు చేయించాలని, కార్మికులకు చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ లోపాలను సరిదిద్దాలని, ఇంజినీరింగ్ కార్మికులకు, క్లాప్ డ్రైవర్లకు జీవో నెంబర్ 36 అమలు చేయాలని, మరణించిన కార్మికుల స్థానాలలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.వి. రమణ, కార్మిక నాయకులు ఎం.వి రమణ, జి.గంగయ్య, ఎం.గంగయ్య, రత్నాలు, సురేష్, ఎం.రెడ్డి, నానమ్మ, లక్ష్మీదేవి, రవి పాల్గొన్నారు.

అసమానతలు లేని అభివృద్ధి కోసం పోరాటం

- నవంబర్ 1 నుంచి సమస్యలపై ప్రజాహోరు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు
- ముగిసిన సిపిఎం జిల్లా ప్రథమ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-రాయచోటి

అసమానతలు లేని జిల్లా అభివృద్ధి కోసం సిపిఎం నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైన అన్నమయ్య జిల్లా సిపిఎం ప్రథమ మహాసభ సోమవారం ముగిసింది. ఈ సభలో ప్రజాసమస్యలపై 30 రకాల తీర్మానాలు చేశారు. కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నవంబర్ 1 నుంచి 7 వరకు ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రజాహోరు నిర్వహించాలని మహాసభ పిలుపు నిచ్చింది. ఈ సభలో వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు, జమిలి ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నవంబర్ 1 నుండి 7 వరకు రాష్ట్ర వ్యాపితంగా ప్రజాహోరు పేరుతో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించాలని 8వ తేదీ జిల్లా కలెక్టరేట్లు, మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. గత మాసం రోజుల్లోనే ధరలు సామాన్యులకు అందుబాటులో లేనివిధంగా ఆకాశాన్నంటాయని, రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్న యువత నిరాశకు గురవుతున్నది. డిఎస్‌సి వాయిదా పడిందని, వెంటనే రిక్రూట్మెంట్ ప్రారంభించి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో ప్రయివేటుపరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై అత్యా చారాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఆచూకి కనపడని ఆడపిల్లల సంఖ్య పెరుగుతున్నది. గత ప్రభుత్వానికి భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి వాగ్దానాలు అమలులోకి రాలేదు. అవినీతి విచ్చలవిడిగా సాగుతున్నది. ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయి. ఫెడరల్ స్ఫూర్తికి భిన్నంగా జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యం గొంతునులిమే కేంద్ర ప్రయత్నాలను తెలుగుదేశం బలపర్చడం గర్హనీయమన్నారు. వక్ఫ్ ఆస్తులపై పెత్తనం కోసం కేంద్రం తెచ్చిన చట్ట సవరణలను కూడా తెలుగుదేశం బలపర్చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం, తెలుగుదేశం మద్దతునివ్వడాన్ని ఖండించారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూ అప్ ఛార్జీల పేరుతో నడుస్తున్న రెండేళ్ళలో రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణపై ప్రభుత్వ నాన్చుడు వైఖరి రాష్ట్రాభివృద్ధికి విఘాతం కలిగిస్తుంది. తక్షణం కార్మిక సంఘాలను పిలిచి చర్చించి కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. అభివృద్ధి ఫలాలు అందరికి అందినప్పుడే అసమానతలు లేని అభివృద్ధి సాధ్యం అవుతుందని, అందుకోసం పాలకుల కార్పొరేట్, భూస్వామ్య అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతు, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం శ్రేణులు పోరాటాలు ఉధృతం చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు జిల్లా నలుమూలల నుండి హాజరైన ప్రతినిధులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శిగా పి.శ్రీనివాసులు



సిపిఎం జిల్లా ప్రథమ మహాసభల్లో జిల్లా నూతన కమిటీని ఏడు గురితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా పి.శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా పి.రాజమ్మ, ఎ.రామాంజులు, సి.హెచ్.చంద్రశేఖర్, సి.రవికుమార్, డి.వెంకటయ్య, పందికాళ్ళ మణిలను ఎన్నుకున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

- ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ



రైల్వేకోడూరు : తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు రాలీ నిర్వహించి, ధర్నా చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని, ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ ఛార్జీలు రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. డిగ్రీ, ఇంజినీరింగ్, బి-ఫార్మసీ వంటి ఉన్నతమైన విద్యలో ఉన్న రీయింబర్స్‌మెంట్ రూ.3480 కోట్లు పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యువగళం పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తే నెల రోజుల్లో రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి వాటి గురించి మాట్లాడడం లేదనిమ విమర్శించారు. 2024-2025 విద్యా సంవత్సరం ప్రారంభమైందని, 1, 3, 5 సెమిస్టర్లకు పరీక్ష ఫీజులు కట్టాలని యూనివర్సిటీ నుంచి సర్కులర్ వచ్చిందన్నారు. ఇప్పటికీ కొన్ని ప్రయివేట్ కళాశాలలో యాజమాన్యం పెండింగ్‌లో ఉన్న మొత్తం డబ్బు చెల్లించాలని విద్యార్థులకు ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం డబ్బులు జమ చేయడం లేదన్నారు. డబ్బు కట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులను ఒత్తిడికి గురి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నవంబర్ 6వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు సంబంధించిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజనం రద్దు చేసిందన్నారు. కూడమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం పునఃప్రారంభిస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ హామీ ఇచ్చారని క్యాబినెట్ సమావేశంలో జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని కోరారు. హాస్టల్ విద్యార్థులకు నిత్యావసరాలు ధరలు అనుగుణంగా మెస్ కాష్మోటిక్ ఛార్జీలు పెంచాలని జిఒ నెంబర్ 77ను రద్దుచేసి పీజీ చదివే ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేసేలా చూడాలని అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం వచ్చే విధంగా చూడాలని కోరారు. ఈ అంశంపై చర్చించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్, ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు జగన్, పవన్ కుమార్, మహేష్, హరినాథ్, నిరాజ్, అభినయ్, భరత్, వంశీ, వినోద్, నవదీప్, నిఖిల్, దామోదర్ పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలు పరిష్కారం కానీ పక్షంలో నవంబర్ ఆరవ తేదీన చేపట్టబోయే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవికి వినతి పత్రం సమర్పించగా సమస్య తన పరిధిలోనిది కాదని తిరస్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, సూర్యవరదన్, శ్రవణ్, ఫహీద్, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజంపేట : నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆర్థిక బకాయిలు చెల్లించడంలో నిర్లక్ష్యం తగదు : యుటిఎఫ్


సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆర్థిక బకాయిలను చెల్లించడంలో కూటమి ప్రభుత్వం ఆలస్యం చేయడం తగదని, కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఐఆర్ ఇవ్వాలని యుటిఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బి.హరి ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ డి.చెంగల్ రాజు, జిల్లా కార్యదర్శులు పి.వెంకట సుబ్బయ్య, సి.వి.రమణ మూర్తి , ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవ మండల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తయినప్పటికీ ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయంగా చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తుందని, చెల్లింపులు ఎప్పుడు చేస్తారో తెలియక ఉద్యోగులు ఆందోళనగా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డిఎలు, సరెండర్ లీవ్‌లు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోల్లో పేర్కొన్న విధంగా ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ప్రపంచ బ్యాంకుతో సాల్ట్ పథకం ఒప్పందాన్ని రద్దు చేయాలని, విద్యా రంగంలో ప్రపంచ బ్యాంకు విధానాలకు స్వస్తి పలకాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులు, అనవసర ఆన్ లైన్ పనుల నుండి మినహాయించాలని చెప్పారు. పూర్తిగా బోధనకు పరిమితం చేయాలని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడకు ప్రశ్నార్థకంగా ఉన్న జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పాఠశాలల నిర్వహణకు పూర్తి స్థాయిలో గ్రాంట్లు మంజూరు చేయాలని, మన బడి-మన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని కోరారు. పాఠశాలల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ : అనంతరం రాజంపేట , నందలూరు, పుల్లంపేట, పెనగలూరు, ఓబులవారిపల్లి, చిట్వేలు మండలాల నూతన యుటిఎఫ్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్, పరిశీలకులుగా రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్ రాజు వ్యవహరించారు.


సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

అర్జీల పరిష్కారంలో అశ్రద్ధ వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన సమస్యలను అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జెసి ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ కె.మధుసూదన్‌రావు, ఎస్‌డిసి రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందిన్నారు. ప్రజలు తమ బాధలు చెప్పుకోవడానికి ఏకైక మార్గం ఈ వేదికని కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. నాణ్యతే ప్రామాణికంగా సమస్యలను పరిష్కరించడంలో ఎలాంటి అశ్రద్ధ చూపరాదన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ పరిధిలోకి వెళ్లకుండా, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డిఆర్ఒ, ఆర్‌డిఒ

కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం కలెక్టర్ శ్రీధర్ చామకూరిని నూతన డిఆర్ఒ కె. మధుసూదన్ రావు, ఆర్‌డిఒ ఎ. శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జెసి ఆదర్శ్ రాజేంద్రన్‌ను కూడా వారు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారికి కలెక్టర్,జెసి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. అనంతరం డిఆర్ఒ తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది నూతన ఆయనకు స్వాగతం పలికారు.

2న గాలివీడు మండల సమావేశం

ప్రజాశక్తి -గాలివీడు

మండల సర్వసభ్య సమావేశం నవంబర్ 2న నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సి.ఎ. జవహర్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, జడ్‌పిటిసి సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గాలివీడు

గేటు వద్ద ఉన్న సర్వే నెంబర్ 921లో కూర్మాయ గారి. రమేష్ రెడ్డికి 5 ఎకరాల స్థలం ఉంది. కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. సోమవారం రమేష్‌రెడ్డి తహశీల్దార్ భాగ్యలతకు విన్నవించారు. తమ స్థలాన్ని స్వాధీనం చేసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించబోయే 3వ జిల్లా మహాసభ జయప్రదం. చేయాలని ఆర్‌ఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్ అన్నారు. సోమవారం ప్రతిభ విద్యాసంస్థల అధినేత శివ గంగిరెడ్డి చేతుల మీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ 'చదువు పోరాడు సాధించు' అనే నినాదంతో ఏర్పడిందని రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, విద్యార్థి, నిరుద్యోగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ విద్యార్థులు మేధావుల మన్ననలు పొందుతూ ముందుకు సాగుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో గత విద్యా సంవత్సరం కాలంగా నిర్వహించిన పోరాటాలు సమీక్షించుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడానికి మహాసభలు నిర్వహించుకుంటున్నామని కావున ఈ మహాసభలకు విద్యార్థులు నిరుద్యోగులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, కిరణ్ పాల్గొన్నారు.

ప్రతి కూలీకి 'ఉపాధి' పని కల్పించాలి

ప్రజాశక్తి - గాలివీడు

ఉపాధి కోరే ప్రతి కూలీకి పని కల్పించాలని ఎంపిడిఒ సి.ఎ. జవహర్ బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన గాలివీడులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను, మస్టర్లను ఆయన తనిఖీ చేశారు డిఒపి పనులు పదిరోజులుగా సాగుతున్నాయని, అక్కడ 250 మంది కూలీలు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గర ఉన్న మస్టర్లను పరిశీలించి సంతృప్తి చెందారు. పని అడిగిన ప్రతి ఒక్కరికీ కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ జవహర్‌బాబు

పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి : మంత్రి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి 21వ అఖిలభారత పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశుగణాంక వివరాలు తెలియజేయడం వల్ల ప్రభుత్వం నుంచి పాడి రైతులకు అందించాల్సిన లబ్ధి సులభతరంగా ఇవ్వవచ్చునన్నారు. జిల్లాలోని పాడి పశువుల రైతులు పశుసంవర్ధక శాఖ అధికారులకు తమకు సంబంధించిన పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వివరాలు వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 2025 సంవత్సరం వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని పాడి రైతులందరూ తప్పకుండా తమ పశువుల వివరాలు అధికారులకు తెలియజేసి ప్రభుత్వ సబ్సిడీలు, పొందాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి గుణశేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ : మండలంలోని వందాడిగ్రామం కదిరివాండ్లపల్లె హరిజనవాడలో సిసి రోడ్డు నిర్మాణానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం గతంలో అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని, రాబోయే రోజులలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు నిర్మించి గ్రామాలలో అన్ని మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, మౌర్యా రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులకు పకడ్బందీగా ఆదేశాలు జారీ చేశారు. గతంలో భూ దోపిడీకి పాల్పడిన వారందరి నుంచి తిరిగి భూములు స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని సూచించారు. అధికారులందరూ బాధితుల సమస్యలను సీరియస్ తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

ప్రజాదర్బార్‌కు పోటెత్తిన ప్రజలు

రాయచోటి : రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. గతంలో ప్రజల సమస్యలు పరిష్కారం కాక ఎన్నో కష్టాలు, కన్నీళ్లతో కాలం వెలదీసిన బాధితులకు మంత్రి నిర్వహించిన ప్రజా దర్బార్ బాధితులకు భరోసానిస్తోంది. కార్యక్రమంలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, జిల్లాల నుంచి కూడా ప్రజా దర్బార్‌కు పలు సమస్యలపై ప్రజలు పోటెత్తారు.

ఇసుక రీచ్ ఏర్పాటు చేయొద్దు

- గ్రామసభలో అధికారులకు రైతుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని మట్లి సమీపంలోని మాండవ్య నదిలో ప్రభుత్వం ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే నదీ పరివాహక ప్రాంత రైతులకు తీవ్ర నీటి ఎద్దడితో బోర్లు బావుల్లో నీటిమట్టం తగ్గిపోయి పంట పొలాలు పెట్టడానికి అవకాశం ఉండదని నది పరివాహక ప్రాంత ప్రజలు పేర్కొన్నారు. సోమవారం మట్లి సమీపంలోని రామాలయం వద్ద సర్పంచ్ సోమారపు నాగార్జునచారి అధ్యక్షతన తహశీల్దార్ శ్రావణి, ఎంపిడిఒ నూర్జహాన్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఇసుక రీచ్ వల్ల మీరు అనుకున్నంత ఇబ్బంది ఉండదని నచ్చజెప్పడానికి ప్రయత్నించగా ప్రజలు ప్రతిఘటించారు. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ ఇసుక రిచ్ ఏర్పాటు చేయవద్దని పదేపదే అధికారులను వేడుకున్నారు. ప్రస్తుతం అరకొర వర్షాలు పడిన తాము పొలాలు పెట్టుకుని జీవనం వెల్లదీస్తున్నామని చెప్పారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే ఇక్కడ భూగర్భ జలాల అడుగంటిపోతాయని పేర్కొన్నారు. బోర్లు బావులు ఎండిపోయి తాము పంటలు లేక ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒకసారి ప్రభుత్వం అనుమతిస్తే ఇక్కడి ప్రజలంతా ఐక్యంగా పోరాడితే రద్దు చేశారన్నారు. ఈవిషయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆలోచించి ఇసుక రీచ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నాగార్జున చారితోపాటు ప్రజలు కోరుతున్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ నాగార్జునాచారి


అక్రమంగా వెలసిన దుకాణం

రాత్రికి రాత్రే వెలసిన అక్రమ దుకాణాలు

ప్రజాశక్తి - గాలివీడు : గేటు వద్ద 900 బి సర్వే నెంబర్‌లో అరవీడు గోరాన్ చెరువు పెరంపల్లి వెళ్లే మూడు మార్గాల మధ్యలో రింగ్ రోడ్డు చేయాలనే ఉద్దేశంతో సర్వే చేశారు. ఆ తరువాత పట్టించుకోకపోవడంతో ఆ స్థలంలో నాలుగు వైపులా కొందరు రోడ్డు స్థలాన్ని ఆక్రమించి రాత్రి దుకాణాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో ప్రభుత్వ స్థలం ఉంది. వాటిపై కొందరి కన్ను పడింది. ఆస్థలాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించప జేయాలని స్థానికులు కోరుతున్నారు. తహశీల్దార్ భాగ్యలత ఏమన్నారంటే నాలుగు రోడ్ల కూడలిలో ఆర్అండ్‌బి స్థలాన్ని ఆక్రమించి రాత్రి రాత్రికి బంకులు నిర్మించిన వారిపై చర్యలు తీసుకుంటామని, హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

వృద్ధులకు అన్నదానం అభినందనీయం

ప్రజాశక్తి- రామాపురం: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషదాయకంగా ఉందని గడ్డం ప్రతాప్ రెడ్డి అన్నారు మండలంలోని బండపల్లి పంచాయతీలో ఉన్న ప్రేమాలయంలో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గాలివీడు మండలం పూలు కుంట పంచాయతీ బోడి రెడ్డి గారి పల్లి చెందిన గడ్డం ప్రతాప్ రెడ్డి ఆర్థిక సాయంతో లయన్స్ క్లబ్ రాయచోటి ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వారికి అన్నదానం చేస్తే తన కుటుంబం సంతోషంగా ఉంటుందని అన్నారు. స్థోమత ఉన్న వారు వృద్ధులకు, అనాథ పిల్లలకు అన్నదానం చేయడానికి ముందు రావాలన్నారు రాబోవు రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు చేసేందుకు లయన్స్ క్లబ్ వారు దోహదపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ మహబూబ్‌బాషా, రాయచోటి లైన్స్ క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి, ప్రతాప్ రెడ్డి కుటుంబ సభ్యులు, ప్రేమాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచార రథంతో పాటు ర్యాలీ చేస్తున్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు

మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తిరుపతిలో నవంబరు 4న జరిగే మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం మండలంలోని వెలగపల్లి, శాఖంవారిపల్లి, జోగినాయునిపల్లి, టేకులకోన గ్రామాల్లో ప్రచార రథంతో పాటు పీలేరు నియోజకవర్గంలోని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రవీంద్ర, వెంకటేష్, బాలకృష్ణ, రెడ్డెప్ప, పవన్ కుమార్, నరసింహులు, గుర్రప్ప, శ్రీరాములు పాల్గొన్నారు. **రామసముద్రం :** మాదిగల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి సమావేశానికి తరలి వచ్చి ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర, మండల అధ్యక్షులు గంగాధర, ఎంఎస్‌పి నాయకులు కొండప్ప పాల్గొన్నారు.



మండల వడ్డెర సంఘం నాయకులు

మండల వడ్డెర సంఘం అధ్యక్షులుగా చిన్నవెంకటప్ప

ప్రజాశక్తి - రామసముద్రం

మండల వడ్డెర సంఘం అధ్యక్షులు రెడ్డెప్ప ఆధ్వర్యంలో వడ్డెర సంఘ కమిటీని ఎన్నుకున్నారు. మండల వడ్డెర కమిటీలో గౌరవ అధ్యక్షులుగా చిన్నవెంకటప్ప, పాలకొండ గంగప్ప, పూజారి సుబ్రమణ్యం ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా కోనంగి గంగప్ప, ఉపాధ్యక్షులుగా సి.వెంకటప్ప, అరికెల రెడ్డెప్ప, చిన్న అప్పయ్య, సహాయకార్యదర్శి ఈశ్వరప్ప, రెడ్డెప్ప, వెంకటరమణ, సిపి మునివెంకటప్ప, కోశాధికారిగా శివ, సహాయ కార్యదర్శిగా కొలకారి శ్రీనివాసులను ఎన్నుకోవడం జరిగింది.

అమీర్‌బాషా మృతి పార్టీకి తీరనిలోటు : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సంబేపల్లె మండలం, ఎస్.సోమవరం గ్రామం దేవలంపేటకు వైసిపి నాయకులు అమీర్‌బాషా మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. అమీర్ బాష గుండె పోటుతో ఆదివారం మృతి చెందారు. సోమవారం దేవలంపేటకు చేరి ఎంపిపి మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సంఘ జిల్లా అధ్యక్షుడు చిదంబరరెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, సర్పంచ్ పాల వెంకటరమణ నాయుడులతో కలసి శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమీర్‌బాషా మృతికి సంతాపం తెలియజేశారు. సర్పంచ్‌గా, నాయకుడిగా, డీలర్‌గా ఎస్.సోమవరం గ్రామానికి విశేష సేవలు అందించారన్నారు. అమీర్ బాషాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని శ్రీకాంత్‌రెడ్డి దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం దేవలంపేటకు చెందిన వైసిపి నాయకులు సయ్యద్ సాబ్ కాలికి తీవ్ర గాయం కావడంతో విశ్రాంతి పొందుతున్నారు. ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులనడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల జెసిఎస్ కన్వీనర్ వడ్డే వెంకట రమణారెడ్డి, పలువురు ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న పొదుపు డబ్బును వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల వారి జీతాల నుండి పొదుపు చేసుకున్న ప్రావిడెంట్ ఫండ్, ఏపి జిఎల్ఐ, సరెండర్ లీవ్ డబ్బులు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇప్పటివరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.20వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, ముఖ్యంగా ఉపాధ్యాయులు తమ జీవిత కాలంలో దాచుకున్న పొదుపు డబ్బులు ఇప్పటి వరకు చెల్లించలేదని వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా చెల్లించే విధంగా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టెక్కుల జయరాజ్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు పిసిరెడ్డెన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయులు రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్ హక్, ముని రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మీ రెడ్డి, ఓబుల్ రెడ్డి సభ్యులు హబీబుల్లాఖాన్, లియాకత్, నరసింహారెడ్డి, సలీం, సయ్యద్ఖాన్ పాల్గొన్నారు.

నవంబర్ 29న టౌన్ బ్యాంక్ ఎన్నికలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఎన్నికలను నవంబర్ 29న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ దుర్గమ్మ, సిఇఒ పివి ప్రసాద్ వెల్లడించారు. సోమవారం స్థానిక కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకులో విలేకరుల సమావేశం నిర్వహించారు. కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌కు సంబంధించి మదనపల్లిలో రెండు, పుంగనూరులో ఒకటి కలిపి మూడు బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. మూడు బ్రాంచ్‌లలో 3401 మంది సభ్యులు ఉన్నారని, వీరందరికీ ప్రస్తుతం ఓటు హక్కు ఉందన్నారు. 90 రోజులలోపు డిఫాల్టర్‌గా ఉన్న వారికి ఓటు హక్కు తీసేస్తామన్నారు. ఆ విధంగా 204 మందికి నోటీసులు జారీ చేశామని, వీరందరూ గడువు తేదీలోగా కంతులు చెల్లించి ఓటు హక్కును పొందాలన్నారు. బ్యాంకులో కంతులు పూర్తిగా చెల్లించి, అప్పు లేకుండా ఉన్న వారికి మాత్రమే డైరెక్టర్‌గా పోటీ చేసే అవకాశం ఉందన్నారు. నవంబర్ 11న ముఖ్య కార్యదర్శిగా ఎన్నికల జాబితా ప్రచురిస్తామని తెలిపారు. 22వ తేదీ నామినేషన్ వేసుకోవచ్చున్నారు. 23వ తేదీ పరిశీలన, 24న ఉపసంహరణకు అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్నికలు అన్ని వార్డుమైన 29వ తేదీ ఎన్నికల నిర్వహించి, అదే రోజున లెక్కింపు నిర్వహిస్తామని తెలిపారు. మెంబర్లు ఈ ఎన్నికలకు సహకరించాలని కోరారు.

మహారాజశ్రీ మోటార్ యాక్సిడెంట్‌క్లైమ్ ట్రిబ్యునల్ మరియు వివిధ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టు :రాయచోటి:

M.V.O.P. 22/2024

దేరంగుల నాగరాజు, తండ్రి వెంకట స్వామి, వయస్సు 38 సంలు, హిందూ, డో.నెం.4-71, నారాయణరెడ్డిపల్లి విలేజ్, సంబేపల్లి మండలము, అన్నమయ్య జిల్లా ....పిటీషనర్/క్లైమెంట్

వర్సెస్

ఆర్2: నగరి రామాంజులు నాయుడు తండ్రి యన్.చలపతి నాయుడు, వయస్సు 45 సంలు, హిందూ, డో.నెం.10/18ఎ, గోంచిపల్లె, పులుకుంట విలేజ్, గాలివీడు మండలం, అన్నమయ్య జిల్లా (ఓనర్) ...2వ రెస్పాండెంట్

నోటీసు

పిటీషనరు రెండవ రెస్పాండెంట్ అయిన మీమీద నష్టపరిహారము కొరకు M.V.O.P. దాఖలు చేసియున్నారు. పై పిటిషన్ నందు రెండవ రెస్పాండెంట్ అయిన మీరు తేది 06.11.2024వ తేదిన ఉదయం 10:30గంలకు పై కోర్టులో నేరుగాగాని, లాయరుద్వారా గాని హాజరై మీమీద పిటీషను ఉన్నచో మనవి చేసుకొనవలెయును. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
టి.వి.రమణ B.A., B.L.
పిటిషనరు తరపు న్యాయవాది
రాయచోటి, అన్నమయ్య జిల్లా

విఆర్‌ఒలు ప్రజలకు అందుబాటులో ఉండాలి



పీలేరు : సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు భీమేశ్వరరావు

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదలీల్లో భాగంగా పీలేరు మండలానికి 15 మంది విఆర్‌ఒలు బదిలీపై వచ్చారు. సోమవారం వారు పీలేరు మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు భీమేశ్వరరావును కలసి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అందిన ఉత్తమ బదలీ ఉత్తర్వులను అందజేశారు. కొత్తగా విధుల్లో చేరిన విఆర్‌ఒలతో తహశీల్దారు పరిచయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు విఆర్‌ఒలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ విధులకు సక్రమంగా హాజరు కావాలన్నారు. ఎక్కడా, ఎవరూ ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా జాగ్రత్తగా తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. మండలంలో 16 గ్రామ సచివాలయాలు ఉండగా వాటిలో బోడుమొల్లువారిపల్లి, గూడరేవుపల్లి సచివాలయాలు మినహా మిగిలిన 14 సచివాలయాల విఆర్‌ఒలు అన్నమయ్య జిల్లాలోని వివిధ మండలాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో 15 మంది విఆర్‌ఒలు జిల్లాలోని వివిధ మండలాల నుంచి బదిలీపై పీలేరు మండలానికి వచ్చారు. మండలంలోని దొడ్డిపల్లి సచివాలయ విఆర్‌ఒ ఎస్.సురేష్ కుమార్‌రెడ్డి స్థానంలో బి.ఎల్లప్ప, కాకులారంపల్లి సచివాలయం విఆర్‌ఒ బి.హేమంత్ నాయక్ స్థానంలో సి.శ్రీనివాసరావు, ముడుపుల వేముల విఆర్‌ఒ ఎం.శాంత కుమార్‌రెడ్డి స్థానంలో బి.వెంకటేశ్వర, పీలేరు-1 ఎం.ఆదిలక్ష్మమ్మ స్థానంలో ఎస్.సుధాకర్, పీలేరు-2 డి.వెంకటరమణ స్థానంలో వి.కళ్యాణి, పీలేరు-3లో సి.ఎర్రయ్య స్థానంలో వి.రెడ్డిశేఖర్, పీలేరు-4కు టి.శిల్పకుమారికి బదులు ఎస్.ఇబ్రహీం, పీలేరు-5లో కె.కవిత స్థానంలో ఇ.శ్రీనివాసులు నాయుడు, రేగళ్ళుకు జి.మునీశ్వర రావుకు బదులు పి.కవిత, బాలంవారిపల్లికి వైవి.రమణ స్థానంలో జి.నారాయణ, వేపులబైలుకు ఎ.రమ్యకృష్ణ స్థానంలో బి.రామయ్య, అగ్రహారం సచివాలయానికి జె.ముని కౌశిక్ స్థానంలో ఎస్.ఇమ్రాన్, తలపుల-1కి పి.రవి ప్రసాద్ స్థానంలో బి.అజయ్, మేళ్లచెరువు (తలుపుల-2)కు టి.వెంకటరమణ స్థానానంలో కె.కదిరప్ప, గోడరేవుపల్లికి బి.హేమంత్ నాయక్ బదిలీపై వచ్చారు.

బాధ్యతలు చేపట్టిన విఆర్‌ఒలు

నిమ్మనపల్లె : మండలంలోని అన్ని గ్రామాలలో విఆర్‌ఒలు బాధ్యతలు చేపట్టారని తహశీల్దార్ ధనుంజయులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న 9 మంది విఆర్‌ఒలు మదనపల్లె, కురబలకోట మండలాలకు బదిలీ కాగా, వారి స్థానంలో రెడ్డివారిపల్లె-1కు పి.హేమాంబరరెడ్డి, రెడ్డివారిపల్లె-2 ఎం.నాగరాజా, రాచవేటివారిపల్లెకు ఎం.శాంత కుమార్‌రెడ్డి, తవళంకు ఎం.శ్రీనివాసులు, నిమ్మనపల్లె-1కు ఎం.సురేంద్రరెడ్డి, నిమ్మనపల్లె-2 ఎం.రెడ్డిరాణి, ముష్టూరు-2 టి.శ్రీనివాసులు, సామకోటవారిపల్లెకు టి.సుధాకర, వెంగంవారిపల్లెకు ఎం.ప్రవీణ్ కుమార్ బాధ్యతలు చేపట్టారని తెలిపారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న విఆర్‌ఒలు వారి గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాలని సూచించారు. భూమి సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ అధికారులతో తరచూ సమీక్షలు చేస్తూ, రైతుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కృత్రిమ మేధపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కళాశాలలో ఐఇఇఇ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సు అండ్ కంప్యూటర్ విషన్ అంశంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెంగళూరు భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ సైటిస్ట్ డి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ క్షిపణి సాంకేతికతను విశధీకరించారు. ఆధునిక సైనిక కార్యకలాపాలు, గతంలో సంప్రదాయ విధానాలపై ఆధారపడి ఉండేవని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదుపరి తరం బాంబుల కార్యాచరణను మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. ఏఐ లక్ష్య ఖచ్చితత్వాన్ని మెరుగుపరుస్తుంది, నిజసమయ డేటాకు అనుగుణంగా ఉంటుంది అని ఆయన అన్నారు. సైనిక కార్యకలాపాలను మరింత ఖచ్చితమైన మరియు ప్రభావవంతంగా ఈ టెక్నాలజీ చేస్తుంది అని అన్నారు. ఏఐ నిర్దిష్ట లక్ష్యాలను గుర్తించి, నిజసమయంలో విమాన నమూనాలను సర్దుబాటు చేస్తుందన్నారు. ఫలితంగా మరింత విజయవంతమైన కార్యాచరణ ఫలితాలు మరియు తక్కువ అనుషంగిక హాని ఉంటుందని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ విజన్ త్వరితంగా బహుళ పరిశ్రమలను మార్చాయని, యంత్రాలు దృశ్య ప్రపంచాన్ని ఎలా గ్రహిస్తాయి, అర్థం చేసుకుంటాయని, సంకర్షణ చెందుతాయనే విషయంలో సంచలనాత్మక పురోగతికి దారితీశాయని పేర్కొన్నారు. ఈ సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్నప్పుడు, ఆరోగ్య సంరక్షణ, ఆటోమోటివ్, రిటైల్, భద్రత వంటి రంగాలలో నూతన ఆవిష్కరణల కోసం కొత్త అవకాశాలను పరిశోధకులు పరిచయం చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. తెలివైన యంత్రాల సామర్థ్యాలు, భవిష్యత్తును పునర్నిర్వచించే ఏఐ, కంప్యూటర్ విజన్‌లో అనేక మార్పులు చేకూరాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ దృష్టిలో పురోగతులు అనేక రకాల పరిశ్రమలను భవిష్యత్తులోకి ముందుకు తీసుకువెళుతున్నాయని విద్యార్థులు వీటిపై దృష్టిలో ఉంచుకోవాలన్నారు. కార్యకమంలో వైస్ ప్రిన్సిపల్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్, ఐఇఇఇ కో-ఆర్డినేటర్ డాక్టర్ సి.కుమార్ పాల్గొన్నారు.

స్థూల జాతీయోత్పత్తికి వ్యవసాయం మూలం : 'చౌప్పా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



కళాశాలను ప్రారంభిస్తున్న చొప్పా గంగిరెడ్డి

మన స్థూల జాతీయోత్పత్తికి వ్యవసాయం ప్రధాన సహకారాల్లో ఒకటని అన్నమాచార్య యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వ్యవసాయ కళాశాలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అగ్రికల్చర్ మొదటం సంవత్సరం చేరబోయే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మన దేశం మొత్తం ఎగుమతి ఆదాయానికి 70 శాతం దోహదం చేస్తుందన్నారు. ప్రపంచంలోని అనేక ఇతర ఆర్థిక వ్యవస్థలకు వ్యవసాయం ఆధారమని, మనదేశం వ్యవసాయాధారిత దేశమన్నారు. రైతులు మనకు అన్నం పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ మన దేశంలో నానాటికీ పెరుగుతున్న జనాభాకు అవసరమైన ఆహార అవసరాలను తీర్చడానికి పని చేసే రైతులకు కనీస సౌకర్యాలు, వనరులు లేవని వారు పేర్కొన్నారు. చాలా మంది రైతులు మెరుగైన పంటల కోసం సేంద్రీయ వ్యవసాయం, ఆధునిక పద్ధతులను అభ్యసిస్తున్నారన్నారు. సేంద్రీయ వ్యవసాయంలో సహజ వనరులపై ఎక్కువ ఆధారపడటం., స్థిరమైన వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల పర్యావరణాన్ని క్షీణత నుంచి కాపాడవచ్చన్నారు. రైతులు జనాభాకు ఆహారం అందించడం ద్వారా వారు జీవనోపాధి పొందుతున్నారన్నారు. సుస్థిర వ్యవసాయం కోసం ఆధునిక వనరులు లేదా ఇన్‌పుట్‌లు వారి మారుమూల ప్రాంతం కారణంగా ఇప్పటికీ వారికి అందుబాటులో లేవని, రైతులు చాలా మంది తమ కుటుంబాల ఆహార అవసరాలను తీర్చడానికి కష్టపడుతున్నారన్నారు. రైతులకు వారి పని నాణ్యతను మెరుగుపరచడానికి కొత్త ఇన్‌పుట్‌లను తీసుకురావడానికి వ్యవసాయదారులు, పరిశోధనా సహచరులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాబోయే సంవత్సరాల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు వ్యవసాయంలో ఉన్నత చదువులు, పరిశోధనలను అభ్యసించాలని, తద్వారా మన రైతులకు మెరుగైన వ్యవసాయ దిగుబడి, జీవన ప్రమాణాలకు భరోసా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ మల్లికార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎం.వి నారాయణ, అన్నమాచార్య యూనివర్సిటీలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్స్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చేపల పెంపకం వేలం పాటలు వాయిదా

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలంలోని రాపూరివాండ్లపల్లి గ్రామ సచివాలయం ఎదుట సోమవారం జరగాల్సిన చేపల పెంపకం వేలం పాటలు వాయిదా పడ్డాయి. రంగసముద్రం చెరువుకు సంబంధించి వేలం పాటలు జరుగుతాయని అధికారులు రెండు రోజుల క్రితం ప్రకటించడంతో సోమవారం వేలం పాటలు దక్కించుకోవాలని అనుకున్న ఆశావాహులు, ప్రజలు అధిక సంఖ్యలో సచివాలయం వద్దకు చేరుకున్నారు. గతంలో టెండర్లు దక్కించుకున్న వారే మళ్లీ ఎలాగైనా రహస్యంగా రెన్యువల్ చేసుకునే ఆలోచనలో ఉన్నారనే విషయం దావనంలా వ్యాపించింది. రెన్యువల్ కాకుండా బహిరంగ వేలం వేయాల్సిందేనని పట్టుబడుతూ ప్రజలు అక్కడే కూర్చున్నారు. 11 గంటలైనా వేలంకు సంబంధించి అధికారులు ఎలాంటి ప్రకటన చేయలేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతోనే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో వేలం పాటల విషయంలో పలువురు గ్రామ స్థాయి నాయకులు వాదులాడుకోవడం, అధికారులను ప్రజలు నిలదీయడంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు ప్రభుత్వ నిభంధనల ప్రకారం చాటింపు వేసి వేలం పాటలు నిర్వహిస్తామని అధికారులు చెప్పడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.

చెకుముకి టెస్ట్‌లో విజేత జోసెఫ్ పాఠశాల

ప్రజాశక్తి - నందలూరు : అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక డైట్ కాలేజీ సభాభవన్ లో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ సర్చ్ పరీక్షలో ప్రయివేటు స్కూల్స్ విభాగంలో నందలూరు మండలానికి చెందిన సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భూమన శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు హుమేరా తస్నిం, పేరీం దేవి, రితేష్ కుమార్ జిల్లా స్థాయిలో నందలూరు మండలానికి వన్నె తెచ్చారని తెలిపారు. ఇందుకు కృషి చేసిన జన విజ్ఞాన వేదిక నాయకులు షేక్ రౌఫ్ బాష, తమ పాఠశాల ఉపాధ్యాయులు శౌరి,రాజేష్, సేవలను కొనియాడారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే రమేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ జన్మదిన వేడుకలు టిడిపి నాయకులు, కార్యకర్తలు సమక్షంలో ఘనంగా జరిగాయి. సోమవారం అన్నమయ్య సర్కిల్‌లోని టిడిపి కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు అధిక సంఖ్యలో నాయకులు తరలివచ్చి కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యే ధైర్యంగా నిలబడి, వైసిపి అరాచకాలను ఎండ గట్టారన్నారు. నాయకులకు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడే వారన్నారు. గతంలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర, చంద్రబాబు నాయుడు మినీ మహానాడు ను విజయవంతం చేయడంలో రమేష్ క్రియా శీలక పాత్ర పోషించారని కొనియాడారు. నిరంతరం టిడిపి నాయకులు, కార్యకర్తల శ్రేయస్సు కోసం పరితపించే దొమ్మలపాటి రమేష్ అన్న ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువ నాయకులు దొమ్మలపాటి యశస్వి రాజ్, చాణుక్య తేజ, దేవరింటి శ్రీనివాసులు, కాశీ శ్రీరామ్ వాల్మీకి, సుబ్రహ్మణ్యం రెడ్డి, మల్లెం ప్రకాష్ నాయుడు, వేల్పుల వెంకటేష్, పసుపులేటి శ్రీనివాసులు, మార్వూరి రమేష్ చౌదరి, మేకల రెడ్డిశేఖర్, సికిందర్, ఫర్వీన్, రెడ్డి శేఖర్, సీపీఐ నాయకులు మురళి, మాధవ, శివారెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

అవగాహనతో అంటు వ్యాధులు దూరం

ప్రజాశక్తి-పీలేరు: ప్రజలెవరూ అవగాహన లోపంతో అంటు వ్యాధుల బారిన పడ కుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని తలుపుల పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని పద్మాతినగర్‌లో వైద్య శిబిరంతో పాటు ఆరోగ్య విద్యా కార్యక్రమం నిర్వహించారు. నిల్వవున్న నీటిలో దోమల లార్వా నాశని అబేటీ మందును ఆశా కార్యకర్తలచే పిచ్చికారి చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ నీటి కలుషితంతో వచ్చే వ్యాధుల గురించి తెలియజేశారు. వాటి నిర్మూలనకు కాచి వడపోసి, లేదా క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలని, తాజా ఆహారాన్నే భుజించాలని, తినడానికి ముందు, మలవిసర్జన తరువాత చేతులు శుభ్రంగా సబుతో బాగా కడగాలని, ఆహార పదార్థాలను సురక్షిత, ఈగలు వాలని ప్రాంతాల్లో నిల్వ చేయాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, క్రిమి సంహారకాలు చల్లి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మురుగునీరు దిగువ ప్రాంతానికి వెళ్లేలా దారి వదలాలని, చెత్తాచెదారం నిర్దేశిత దూర ప్రాంతంలో శాస్త్రీయంగా నిర్మూలించాలని ప్రజలకు తెలిపారు. జ్వరం, జలుబు, వికారం, వాంతి, కడుపు నొప్పి, డయేరియా లాంటి అంటూ వ్యాధుల సమస్యలను నిర్లక్ష్యం చేయక దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్ సలహాలు, సూచనలు, చికిత్సలు ఉచితంగా పొందాలని తెలియ జేశారు. వైద్యశిభిరములో 31 మందికి చిరువ్యాధులకు చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. దోమలవల్ల వచ్చే వ్యాధి నిర్ధారణకు రక్త నమూనాలను సేకరించారు. వైద్య శిబిరాలు ప్రతి సచివాలయ పరిధిలోనూ నిర్దేశిత ప్రాంతా ల్లో నిత్యం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఎంపిహెచ్ఇఒ శ్రీనివాసులు, రత్నం, శివ, ఎఎన్ఎం విజయకుమారి, రత్నం, శివ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.5 లక్షలు చెక్కు అందజేత

ప్రజాశక్తి-పీలేరు : ఏనుగుల దాడిలో మృతి చెందిన రైతు కుటుంబానికి అన్నమయ్య జిల్లా అటవీ శాఖ అధికారులు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ నెల 15న పీలేరు పట్టణ శివారులోని, ఇందిరమ్మ కాలనీ సమీపంలో తన పొలం దగ్గరికి ఆవులు తోలుకు పోతున్న బందార్లపల్లికి చెందిన రైతు, మాజీ ఉప సర్పంచ్ ఎం.చిన్న రాజారెడ్డిపై ఏనుగులు దాడి చేసి చంపిన సంఘటన పాఠకులకు విధితమే. కలికిరి ఎఫ్‌బిఒ జి.గిరినాథ్, ఎబిఒ జ్యోతి సోమవారం మండలంలోని బందార్లపల్లిలోని మృతుడి ఇంటికి చేరుకుని, అతని సతీమణి ఎం.సుజాతకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.



బి.కొత్తకోట : విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీడీలు

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

యోగి వేమన విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు స్థానిక శ్రీ సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు పి.జశ్వంత్, ఎన్.కళ్యాణ్ ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డి.పుల్లారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్‌లు, అధ్యాపకులు అభినందించారు.

బి.కొత్తకోట : పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం బిఎస్సీ చదువుతున్న విద్యార్థి టి.శ్రావణ లక్ష్మీకర్ సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ తెలిపారు. ఎస్.వి. యూనివర్సిటీలో జరిగిన కబడ్డీ జట్టు ఎంపిక పోటీలలో సుమారుగా 300 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో అత్యంత ప్రతిభ కనబరిచిన టి.శ్రావణ్ లక్ష్మీకర్‌ని సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకి ఎంపిక చేశారని తెలిపారు. ఈ నెల 30వ తేదీ ఎస్.ఆర్.ఎం.యూనివర్సిటీ చెన్నైలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ పోటీలలో ఆ విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు. సౌత్ జోన్ కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థిని అందుకు కృషి చేసిన ఇన్‌ఛార్జి బి.రాజేంద్ర నాయక్, టీమ్ మేనేజర్ డి.సోమశేఖర్‌లను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

ఎస్‌డికెఆర్ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

ప్రజాశక్తి - వీరబల్లి : మండల కేంద్రంలోని ఎస్‌డికెఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు సోమవారం ఘనంగా ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్, ఎపిజిబి మేనేజర్ మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించినప్పుడే కళాశాలకు, తల్లి తండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని చెప్పారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకొని వాటిని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు. పోటీ ప్రపంచంలో విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించినపుడే చదివిన చదువుకు సార్థకత ఉంటుందని అన్నారు. కళాశాల డైరెక్టర్ రవి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భవిత నేటి యువత పైనే ఆధారపడి ఉంది. విద్యతో పాటు సామాజిక సేవను నేటి విద్యార్థులు అలవర్చుకోవాలని కోరారు. పేద పిల్లలు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు పడుతుండంతో జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న విఆర్‌డిఎస్ ఆధ్వర్యంలో కళాశాల స్థాపించామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్య క్రమాలు ఎంతగానో ఆకట్టుకొన్నాయి. అతిథులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విఆర్‌డిఎస్ చైర్మన్ సురేంద్రారెడ్డి , కళాశాల అధ్యాపకులు నాగయ్య, రమణ, లక్ష్మణ్, గీత, అంజలి, శ్రీను, గోపి, నాగార్జున విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధిని జీర్ణించుకోలేని జగన్ : ఆర్‌జె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అభివృద్ధి, సంక్షేమ పాలన చూసి మాజీ సిఎం జగన్ ఓర్వలేకపోతున్నారని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లి, చెల్లి కూడ జగన్ మాటలను నమ్మే పరిస్థితి లేదన్నారు. ఆనాడు జగన్ మోహన్‌రెడ్డి తీసుకొన్న నిర్ణయాలే రాష్ట్ర ప్రజలకు శాపంగా, పాపంగా మారాయని నిప్పులు చెరిగారు. దీపావళి కానుకగా రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచుతోందనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గత ప్రభుత్వంలో 9 సార్లు కరెంట్ ఛార్జీలు పెంచితే, టిడిపి పాలనలో ఒక్కసారి కూడ విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం నిర్ణయాలు రాష్ట్రాన్ని 25 ఏళ్లు వెనక్కి నెట్టేశారన్నారు. రాష్ట్రంలో నేడు అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఓ వైపు రోడ్ల నిర్మాణాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర భౌగోళిక స్వరూపాన్ని మార్చేస్తున్నాయని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, కేంద్రం పెద్దఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. దేశానికే దిక్సూచిగా అమరావతి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర రాజధానిని కేంద్రంలోని రాష్ట్రాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అనుసంధానం చేసేందుకు జరుగుతున్న పనులే నిదర్శనమన్నారు.

మల్లయ్య కొండకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. పూజారులు, ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇఒ మునిరాజా, కొండకిట్టాలు భక్తులకు సౌకర్యాలు కల్పించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కళాకారులు శివనామ స్మరణతో భజనలు నిర్వహించారు.

క్రైం కార్నర్



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

రెండు కార్లు ఢీ : ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

రెండు కార్లు ఢీకొనగా ఆరుగురికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సోమవారం సిఐ గురునాథ మాట్లాడుతూ మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ స్థానిక పోతు వారిపల్లెకి పోయే దారికి సమీపంలో చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిపై రెండుసార్లు ఎదురెదురుగా వస్తూఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కర్నూలు పట్టడానికి చెందిన ఐదుగురు వ్యక్తులు మారుతి సుజుకి కారులో రాయచోటి నుండి మహాల్‌కు వెళుతుండగా, ఎదురుగా పీలేరు నుండి రాయచోటి వైపు వెళున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కర్నూలుకు చెందిన రాఘవేంద్ర, ప్రభాకర, కిషోర్, అనిల్ కుమార్, మహేష్‌లకు, రాయచోటి వైపు వెళ్తున్న కారు డ్రైవర్ జగదీష్‌కు బలమైన రక్త గాయాలు కావడంతో కలకడ, పీలేరు 108 వాహనాలలో పీలేరు తరలించినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కిషోర్, అనిల్ కుమార్‌కు కాళ్లు విరిగినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి స్థానిక పోలీసులు వెళ్లి పరామర్శించి, క్షతగాత్రులను 108 వాహనంలో పీలేరు చికిత్స నిమిత్తం తెలిపారు. ఈ సంఘటనపై హెడ్ కానిస్టేబుల్ హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరికి...

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని కడప-చెన్నై హైవేలో సోమవారం మధ్యాహ్నం రెండు బైకులు ఢీకొన్న సంఘటన చోటు చేస్తుంది. గ్రామస్తుల కథనాల మేరకు ఎదురెదురుగా వెళుతున్న రెండు బైకులు ఢీకొనగా ఇద్దరు వ్యక్తులకి తీవ్ర గాయాలు కావడంతో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలియజేశారు.